

## దర్గా కూల్చివేయడం చట్టవిరుద్ధం

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని హజ్రత్ తాజుద్దీన్ ఖాజా బాగ్ సవార్ దర్గాను అక్రమంగా కూల్చివేయడం చట్టవిరుద్ధమని తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ మొహమ్మద్ హమీద్ అన్నారు. సమితి సభ్యులతో కలిసి గురువారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెజిటెడ్ వక్ఫ్ ఆస్తిగా నమోదైన ఈ దర్గాను తొలగించరాదని వక్ఫ్ బోర్డు గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. అయినప్పటికీ ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రాత్రికి రాత్రే కూల్చివేయడం సరికాదని మండిపడ్డారు. వేములవాడ రాజన్న ఆలయానికి ఆనుకుని ఉన్న ఈ దర్గా దశాబ్దాలుగా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. వక్ఫ్ చట్టాలను ఉల్లంఘించి కూల్చివేతకు ఆదేశాలు జారీ చేసిన అధికారులు, సిబ్బందిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూల్చివేత జరిగిన అదే స్థలంలో ప్రభుత్వ ఖర్చుతో దర్గాను తక్షణమే పునర్నిర్మించాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ భూములు, కట్టడాల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జానీ, ఆరిఫ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పశు వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని దుబ్బగూడా గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కౌసల్యా బాయితో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఆర్థిక పురోభివృద్ధి పశువుల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. పాడి పశువులకు సరైన సమయంలో వైద్యం అందించడంతో పాటు పోషకాహారం, శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం జైనూర్ పశువైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. గర్భకోశ సంబంధిత వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది, గ్రామ పటేల్, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నటుల సర్పంచ్ మామిడాల లలిత అన్నారు. గురువారం తాండూర్ మండలం రాజీవ్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ బోర్‌కు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో గ్రామస్తులకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా బోర్ కు మరమ్మత్తులు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. గ్రామస్తులకు నిరంతరం తాగునీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## కలెక్టర్‌గా గరిమ బాధ్యతల స్వీకరణ



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో గరిమ అగ్రవాల్ గురువారం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2025 అక్టోబర్ 23 నుంచి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా, ఇంచార్జి కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం అర్చకులు కలెక్టర్‌కు ఆశీర్వచనం అందించారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పలువురు జిల్లా అధికారులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామ్ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రావణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మరణంలోనూ గెలిచిన మానవత్వం

### బ్రెయిన్ డెడ్ అయిన సృజన అవయవాలు దానం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** తల్లిగా పరవశించాల్సిన వేళ.. విధి ఆ కుటుంబాన్ని వెక్కిరించింది. కానీ, ఆ పుట్టెడు దుఃఖంలోనూ ఆ కుటుంబం తీసుకున్న నిర్ణయం ఐదుగురి ప్రాణాల్లో వెలుగులు నింపింది. బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందిన గుండు సృజన (33) అవయవాలను దానం చేసి ఆమె కుటుంబ సభ్యులు అత్యున్నత మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లా కేంద్రంలోని జనకపూర్‌కు చెందిన గుండు సృజన తన



భర్త నాగరాజుతో కలిసి వియత్నాంలో స్థిరపడ్డారు. వీరికి ఐదేళ్ల కుమార్తె ఉంది. రెండో కాన్పు కోసం స్వగ్రామానికి వచ్చిన సృజన, 23 రోజుల క్రితం మగ బిడ్డకు జన్మనిచ్చింది. అంతా సంతోషంగా ఉందనుకుంటున్న సమయంలో ఆమెకు అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే మంచిర్యాల నుంచి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు ఆమెకు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. సృజన కోలుకోదని తెలిసినప్పటికీ ఆమె మరణం వృథా పోకూడదని భర్త, కుటుంబ సభ్యులు గుండె నిబ్బరంతో ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవయవ దాన సంస్థ 'జీవన్‌దాన్' సమన్వయంతో ఆమె గుండె, కాలేయం, ఊపిరితిత్తులు ,రెండు మూత్రపిండాలను దానం చేశారు. తన బిడ్డలకు తల్లి లేని లోటు ఉన్నప్పటికీ, ఆమె అవయవాల ద్వారా మరో ఐదు కుటుంబాల్లో దీపం వెలిగించడం నిజమైన నివాళి అని స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. అమ్మగా పునర్జన్మ ఎత్తిన కొద్దిరోజులకే అనంత లోకాలకు వెళ్లిన సృజన, తన అవయవ దానంతో అమరురాలిగా నిలిచారు.



# టూవీలర్ మొపెడ్ పథకం దరఖాస్తుల వెరిఫికేషన్‌కు విశేష స్పందన







**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని మైనార్టీ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న టూవీలర్ మొపెడ్ పథకానికి సంబంధించిన దరఖాస్తుల వెరిఫికేషన్ కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగుతోంది. ఉదయం నుంచే లబ్ధిదారులు భారీగా హాజరై అవసరమైన పత్రాలను సమర్పించారు. అధికారులు ప్రతి దరఖాస్తును అర్హత ప్రమాణాల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ఫకీర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ సలీం హాజరై మాట్లాడారు. మైనార్టీ వర్గాల ఆర్థికాభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మహమ్మద్ హమీద్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షబ్బీర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పథకం ద్వారా చిన్న వ్యాపారాలు, డెలివరీ సేవలు, ఉద్యోగ అవసరాల కోసం ప్రయాణ సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, త్వరితగతిన టూవీలర్ వాహనాల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని కోరారు. అవసరమైన పత్రాలు సక్రమంగా ఉన్న వారికి త్వరలోనే అనుమతులు మంజూరు చేస్తామని అధికారులు వెల్లడించారు. పరిశీలన కార్యక్రమం గురు, శుక్రవారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్రమబద్ధంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫకీర్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు హైదర్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు హనీఫ్, భావన్ చాంద్ మియా తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ కెరటం క్యాలెండర్ ఆవిష్కరణ

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా మైనారిటీ కార్యాలయంలో ఉద్యమ కెరటం క్యాలెండర్ ను గురువారం జిల్లా మైనారిటీ శాఖ అధికారి భారతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి, సామాజిక చైతన్యం పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. 'ఉద్యమ కెరటం' క్యాలెండర్ ద్వారా ఉద్యమాల ప్రాధాన్యం, నాయకుల సేవలు, సామాజిక బాధ్యతలు ప్రతి ఇంటికీ చేరడం అభినందనీయమని తెలిపారు. మైనారిటీ వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ సలీం మాట్లాడుతూ సంఘం ద్వారా పేద ముస్లిం ఫకీర్ కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహకాలు, వైద్య సహాయం, వృత్తి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వెనుకబడిన వర్గాలు ఐక్యంగా ముందుకు సాగితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ క్యాలెండర్ ద్వారా సంఘ కార్యకలాపాలు, ముఖ్య దినోత్సవాలు, సామాజిక సందేశాలు ప్రజలకు చేరుతాయని అన్నారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్



హమీద్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సోషల్ మీడియా పాత్ర కీలకమని, సంఘ సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం తమ బాధ్యత అని తెలిపారు. యువత సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముస్లిం ఫకీర్ (బీసీ ఈ--4) సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ సలీం, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ హమీద్, ఉద్యమ కెరటం తెలుగు దినపత్రిక జిల్లా స్టాఫ్ రిపోర్టర్ షేక్ షబ్బీర్‌తో పాటు ఫకీర్ సంక్షేమ సంఘం జిల్లా, మండల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# వరుస దొంగతనాల కేసులు ఛేదింపు

**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలో జరిగిన వరుస ఇంటి దొంగతనాల కేసులను ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ నితికా పంత్ తెలిపారు. గురువారం కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీకి చెందిన ఏఎన్ఎం దండే మంగా జనవరి 3న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఏడున్నర తులాల బంగారంతో పాటు ఒక కిలో వెండి వస్తువులు సుమారు రూ.2లక్షల 75వేల విలువైన ఆస్తిని అపహరించినట్లు తెలిపారు. జనవరి 5న బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు. పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ కాలనీకి చెందిన జేసీబీ డ్రైవర్ ఇర్షాద్ పాషా అలియాస్ తాజ్ను అదుపులోకి తీసుకొని విచారించగా, తన సహచరులతో కలిసి దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. సెంట్రింగ్ పనిచేస్తున్న సర్‌సిల్క్ కాలనీకి చెందిన షేక్



**నలుగురు నిందితుల అరెస్ట్**

**జిల్లా ఎస్పీ నితికా పంత్**

అంజద్, చింతగూడ గ్రామానికి చెందిన జేసీబీ డ్రైవర్ మిర్జా సోహేల్ బేగ్‌లను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. దొంగతనం చేసిన ఆభరణాలను కొనుగోలు చేసిన బాలాజీనగర్‌కు చెందిన గోల్డ్‌స్మిత్ చిలుకూరి శ్రీకాంత్ ను సైతం అదుపులోకి తీసుకొని విచారించగా, నేరం ఒప్పుకున్నట్లు వివరించారు. నిందితుల నుంచి బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. గతంలో నమోదైన పలు ఆస్తి నేరాల్లో కూడా ఈ గ్యాంగ్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలో తాళాలు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో కాగజ్‌నగర్ సీఐ ప్రేమ్ కుమార్, ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

